సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో : వ్యక్తికి గాయాలు

ఐనవోలు, సెప్టెంబర్ 25 : సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీ కొట్టిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొండేటి సదానందం సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో ఆటో ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో సైకిల్‌పై ప్రయాణిస్తున్న సదానందం తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా ఎంజీఎం దవాఖానకు తరలించారు.

ఈఈ రాజయ్యకు ఎస్ఈగా ఉద్యోగోన్నతి

వరంగల్, సెప్టెంబర్ 25 : గ్రేటర్ కార్పొరేషన్‌లో ఈఈగా పని చేస్తున్న రాజయ్యకు ఎస్ఈగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ బుధవారం రాత్రి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల సాధారణ బదిలీల్లో బల్దియా ఎస్ఈ కృష్ణారావు బదిలీ కావడంతో ఈఈ రాజయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రభుత్వం ఆయనకు ఎస్ఈగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లోనే పోస్టింగ్ ఇచ్చింది.

'కేయూ భూములు స్వాధీనం చేసుకోవాలి'

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 25 : కబ్జా అయిన కాకతీయ యూనివర్సిటీ భూములను స్వాధీనం చేసుకోవాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్(డీఎస్ఏ) రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ డిమాండ్ చేశారు. వర్సిటీ గెస్ట్ హౌస్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ భూములను అధికారులే కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. కో కన్వీనర్ మున్నా గణేశ్ మాట్లాడుతూ.. వర్సిటీకి 650 ఎకరాల పైచిలుకు భూమి ఉంటే ప్రస్తుతం 400 ఎకరాలు మాత్రమే ఉందని, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ద్వారా ఏర్పాటు చేసిన హద్దుల వరకు ఉన్న భూమి వర్సిటీకి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ భూమిలో గతంలో ఏర్పాటు చేసిన సీఆర్ఎఫ్ బెటాలియన్‌ను మణిపూర్‌కు తరలించారని, ఆ స్థలంతో పాటు భవనాలను యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీల అవసరాల కోసం వినియోగించాలని, శుభం ఫంక్షన్ హాల్ భూమినీ అప్పగించాలని డిమాండ్ చేశారు. డీఎస్ఏ రాష్ట్ర నాయకులు ఉప్పుల శివ, మహేశ్, సాయిరాం, రవి, శివ పాల్గొన్నారు.

'న్యాయపోరాట చైతన్యదీప్తి భద్రూనాయక్'

న్యూశాయంపేట, సెప్టెంబర్ 25 : కాకతీయ విశ్వవిద్యాలయంలో క్లర్క్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఆచార్యులుగా సేవలందించిన న్యాయపోరాట చైతన్యదీప్తి ఆచార్య భద్రూనాయక్ స్ఫూర్తిప్రదాత అని మాజీ ఎంపీ, కేయూ విశ్రాంతాచార్యులు సీతారాంనాయక్ అన్నారు. బుధవారం హంటర్‌రోడ్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో పీఠాధిపతి ప్రొఫెసర్ బాబురావు అధ్యక్షతన భద్రూనాయక్ సంస్మరణ సభ నిర్వహించారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, కేయూ ఆచార్యులు వెంకటనారాయణ, విజయబాబు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుదర్శన్ భద్రూనాయక్ చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడారు. ఆచార్య సారంగపాణి, ఎర్రగట్టు స్వామి, రవీందర్, వివిధ సంఘాల నాయకులు వల్లంపట్ల నాగేశ్వరరావు, ఎల్లయ్య, రాజ్‌మహ్మద్, సదాలక్ష్మి, సుధాకర్, రమేశ్, యాదవరెడ్డి, శ్రీమంతుల దామోదర్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తా

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

ముల్కనూరులో యువకులతో నరేందర్‌రెడ్డి

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 25 : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ముల్కనూరులో అంబేద్కర్ కూడలి వద్ద మాట్లాడారు. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు పేర్కొన్నారు. యువత ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రావడం లేదన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే ఒక్క రూపాయి జీతం తీసుకోకుండా స్వచ్ఛందంగా సేవ చేస్తానని ప్రకటించారు. అంతకుముందు యువకులు నరేందర్‌రెడ్డికి బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా
- ఘనంగా కేయూ ఇంజినీరింగ్ కాలేజీ ఆవిర్భావ వేడుకలు

యూ బ్లడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 25 : మహిళలు అన్ని రంగాల్లో ముందువరసలో ఉండాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు. కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ 11వ ఆవిర్భావ వేడుక సెనేట్ హాల్‌లో ప్రిన్సిపాల్ భిక్షాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. షీ టీంలపై అవగాహన ఉండాలన్నారు. వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ నాగవాణి మాట్లాడుతూ.. చదువుతో పాటు వ్యక్తిగత రక్షణ, సమాజంపై అవగాహన కలిగి ఉండి, మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కాలేజీ కీర్తిని, యూనివర్సిటీ ప్రతిష్టను ప్రపంచ నలుమూలలకు చాటాలన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తెలంగాణలో మొదటి మహిళా ఇంజినీరింగ్ కాలేజీగా 2013లో ఏర్పాటు చేసిన కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ ముందు వరుసలో ఉందన్నారు. అనంతం క్రీడలు, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం యూ బ్లడ్ యాప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమ, చిత్ర రాజు, కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిరణ్, కాలేజీ అధ్యాపకులు వీణ, తూర్పాటి వెంకటేశ్, సురేందర్, సాయితరుణ్, స్వప్న, వాణిశ్రీ, సాహితీ, యశస్విని, దీప్తి, పీవీ వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, దేవేందర్, వాణి, జ్యోత్స్న, అనూష, రమాజ్యోతి పాల్గొన్నారు.

కేటీఆర్‌కు భద్రకాళీ అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న పున్నంచందర్

కేటీఆర్‌కు భద్రకాళీ అమ్మవారి చిత్రపటం అందజేత

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 25 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నంచందర్ హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కలిసి భద్రకాళీ అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. వైస్ ప్రెసిడెంట్ పండుగ సాగర్, కానుగంటి అరవింద్, మూల ప్రభాకర్, తాడిశెట్టి రాము, ప్రభాకర్, దాసరి సమ్మయ్య, రవి, కృష్ణ, నారాయణగిరి రాజు, రమేశ్ ఉన్నారు.

క్రషర్ల తనిఖీ

వేలేరు, సెప్టెంబర్ 25 : మండలంలోని పీచర, కమ్మరిపేట, గొల్లకిష్టంపల్లి గ్రామాల్లోని క్రషర్లను బుధవారం జిల్లా మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రషర్ నిర్వహణకు సంబంధించిన ధ్రువీకరణ,అనుమతి పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. క్రషర్ యాజమాన్యం మైనింగ్ నియమ నిబంధనలు పాటిస్తూ తవ్వకాలు జరపాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్ కొమి, ఆర్ఐ సురేందర్, వేలేరు ఎస్సై అజ్మీరా సురేశ్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

హనుమకొండ, సెప్టెంబర్ 25 : కమలాపుర్ జిల్లా ప్రజా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు రాజమల్లయ్యపై బుధవారం కలెక్టర్ ప్రావీణ్యకు వరంగల్ ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినిని కించపరుస్తూ మానసికంగా వేదనకు గురి చేస్తున్నందున ప్రధానోపాధ్యాయుడిపై కలెక్టర్, వరంగల్ విద్యాశాఖ ఆర్జేడీ, డీఈవోకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టాలని విద్యాశాఖాధికారికి కలెక్టర్ సూచించారు. నాయకులు రవిప్రకాశ్, యుగంధర్, చింత విక్రమ్, చాట్ల రవికుమార్, అనిల్ ఉన్నారు.

వాహనాల వేలం ద్వారా రూ.3.67లక్షల ఆదాయం

పరకాల, సెప్టెంబర్ 25 : పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం ద్వారా రూ. 3.67లక్షల ఆదాయం సమకూరినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ తాతాజీ పేర్కొన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం 16 ద్విచక్ర వాహనాలను వేలం వేసినట్లు తెలిపారు. వాహనాలకు ఎంవీఐ రూ.1.95లక్షల విలువ నిర్ణయించగా వేలంలో రూ.3,67,084 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

'క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరం'

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 25 : క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరమని హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గీతా వేముగంటి అన్నారు. విశ్వవిద్యాలయ జంతుశాస్త్ర విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ యానిమల్ సైన్సెస్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనేక రకాల మందులు వాడడం వలన క్యాన్సర్ కణాల రోగ నిరోధక శక్తి క్రమంగా తగ్గుతుందన్నారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకు పోతున్నదన్నారు. జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శమిత, ప్రొఫెసర్ వెంకయ్య, నారాయణ, మామిడాల ఇస్తారి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 25 : రెక్కాడితేగానీ డొక్కాడని తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటోడ్రైవర్స్ జేఏసీ గౌరవాధ్యక్షుడు చిర్ర రమేశ్‌గౌడ్, కన్వీనర్ ఎండీ అంకూషాపలీ కోరారు. బుధవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం వల్ల తమకు ఉపాధి కరువైందని వాపోయారు. ఆటోడ్రైవర్స్ ఉమ్మడి జిల్లా జేఏసీ ప్రతినిధులు యాదగిరి, ఎల్లయ్య, లక్ష్మయ్య, సాంబయ్య, సదయ్య ఉన్నారు.

నేడు డయల్ యువర్ హనుమకొండ డీఎం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 25 : ఈ నెల 26న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ధరమ్‌సింగ్ తెలిపారు. జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, హనుమకొండ, కాజీపేట, పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు డిపో అభివృద్ధి, బస్సు సర్వీసులపై తమ అభిప్రాయాలను 99592 26049 నంబర్‌లో తెలియజేయాలని కోరారు.

వాగ్దేవిలో వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకలు

నయీంనగర్, సెప్టెంబర్ 25 : నయీంనగర్‌లోని వాగ్దేవి కాలేజీలో ప్రిన్సిపాల్ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఎం దవాఖాన ఆర్ఏం మురళి మాట్లాడారు. డ్రగ్ డిస్కవరీ, క్లినికల్, డిస్పెన్సింగ్, ఇండస్ట్రియల్, హాస్పిటల్ తదితర ఫార్మా విభాగాల్లో ఫార్మసిస్టుల ప్రాముఖ్యం, ప్రాధాన్యత వెలకట్టలేనిదన్నారు. డాక్టర్ సనత్‌రోషన్, భిక్షపతి, సాయి నిఖిత, శ్రీనివాసరెడ్డి, శ్రావణ్‌కుమార్, శరవణభవ, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, మహేశ్, గిరిజ, పావని, రజినీ, స్నేహప్రియ, సఫియా నసీర్, లావణ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంజీఎం దవాఖాన ఆర్ఏం మురళి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, సెప్టెంబర్ 25 : హనుమకొండ టౌన్‌లోని వివిధ సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో కిషన్‌పుర ప్రాంతంలో ఉదయం 9 నుంచి 10గంటల వరకు, ఈద్గా, ఫైన్ ఫంక్షన్‌హాల్ ఏరియా, పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ, నయీంనగర్, లష్కర్ సింగారం, రాంనగర్, రాజాజీనగర్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వెనుక వైపు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, వినాయక నగర్‌కాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డు, కోర్టు వెనుక వైపు ఏరియాల్లో ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు, సిద్ధార్థనగర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, అన్సారీకాలనీ, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం, హనుమకొండ చౌరస్తా, కాకాజీకాలనీ, లైబ్రరీ, మచిలీబజార్, రాంనగర్, సాయినగర్, టెలిఫోన్ ఎక్స్చేంజీ ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

పెగడపల్లి పీఏసీఎస్‌లో ఒక్కరికే రుణమాఫీ..

రికార్డుల్లో తప్పులు దొర్లడంతో సీఈవో సస్పెన్షన్

హసన్‌పర్తి, సెప్టెంబర్ 25 : పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పెగడపల్లి, ముచ్చర్ల, నాగారం, సీతానాగారం, పలివేల్పుల, సింగారం, కుమార్‌పల్లి గ్రామాలు ఉన్నాయి. సొసైటీ పరిధిలో మొత్తం 1,012 రైతులు రూ.10.90 కోట్ల రుణాలు తీసుకున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు రుణమాఫీ మూడు విడుతలుగా చేపట్టింది. కానీ సొసైటీలో ఒక్కరికి మాత్రమే రూ.50.472 వేల రుణమాఫీ అయింది. ప్రభుత్వం తప్పిదం వల్ల 1,012 మంది రైతులకు మొదటి విడుతలో 250 మందికి ఒక్కొక్కరికి రూ.10 చొప్పున ఐవోబీలో జమయ్యాయి. రెండో విడుతలో 1,012 మంది రైతులకు రూ.45,240 జమయ్యాయి. రుణమాఫీ అయినట్లు మెసేజ్ రాకపోవడంతో రైతులు సొసైటీకి వచ్చి పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈవో ఏసోబును అడగడంతో అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు సొసైటీలోని రికార్డులను పరిశీలించగా, తప్పిదాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో పై అధికారులకు సీఈవో ఏసోబుపై ఫిర్యాదు చేశారు. జిల్లా సహకార శాఖ అధికారి నీరజ సీఈవోను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో గణేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, రైతులు తీసుకున్న రుణాల్లో వడ్డీ జమ చేయడంలో సీఈవో ఏసోబు పొరపాట్లు చేసినట్లు గుర్తించి జిల్లా సహకారశాఖ అధికారి సస్పెండ్ చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ చల్లా గోపాల్‌రెడ్డి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

శాయంపేట, సెప్టెంబర్ 25 : గట్లకానిపర్తి గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఇంట్లో ఆత్మహత్యాయత్నం చేయగా, గమనించిన కుటుబసభ్యులు వెంటనే పరకాల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు సమాచారం. వివరాలు తెలియాల్సి ఉంది.

ఏడుగురు ట్రైనీ ఎస్సైలకు స్టేషన్ అలాట్

సుబేదారి, సెప్టెంబర్ 25 : శిక్షణ పూర్తి చేసుకున్న ఏడుగురు ప్రొబేషనరీ ఎస్సైలను సీఐ అంబర్ కిశోర్ ఝా బుధవారం రెండు విడుతలుగా పోలీసు స్టేషన్లకు అలాట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీ పవన్ కాజీపేట-మామునూరుకు, బీ హేమలత సుబేదారి-వర్ధన్నపేటకు, బీ శివ మిల్స్‌కాలనీ-రఘునాథ్‌పల్లికి, బీ సుజిత్ ఆత్మకూరు-హనుమకొండ, ఏ మధు జనగామ-ఇంతేజార్‌గంజ్, ఎల్ దిలీప్ నర్సంపేట-హసన్‌పర్తి, పీ భాగ్యశ్రీ స్టేషన్‌ఘన్‌పూర్-పరకాలకు అలాట్ అయ్యారు.

కేడీసీలో ముగిసిన నైపుణ్య శిక్షణ

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 25 : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలంగాణ నైపుణ్య శిక్షణ విభాగం(టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో 'కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ స్కిల్స్' అనే అంశంపై రెండు రోజుల శిక్షణ ముగిసినట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, మెంటార్ సాగర్ పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రైసిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్పున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు.